# అభివృద్ధి నిరోధక ఫాసిస్టు బిజెపి దూకుడికి కళ్లెం

**ఎన్నికల** ఫలితాలు వెలువడ్డాయి. చాలామందిని ఆశ్చర్య చకితులను చేశాయి. తిరుగులేని బిజెపి 10 ఏళ్ల పాలనపై ఒక రకపు తీర్పుగా ఈ ఫలితాలను భావించవచ్చు. ఎన్డీఏకి నాయకత్వం వహిస్తున్న బిజెపి లోక్‌సభలో అధిక స్థానాలను సాధించిన పెద్ద పార్టీగా అవతరించిందే తప్ప, స్వయంగా అధికారంలోకి రాగలిగే సంఖ్యా బలాన్ని సాధించలేక పోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు 32 సీట్లు తగ్గాయి. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సాయంతో మరోసారి అధికార పగ్గాలు చేపట్టేందుకు, వారు చేజారకుండా త్వరత్వరగా పావులు కదుపుతోంది. చంద్రబాబు (టీడీపీ), నితీష్‌కుమార్ (జేడీ-యు)ల మద్దతు ఉంటేనే మూడవసారి బిజెపి పరిపాలన సాగించగలుగుతుంది. కానీ, అంత సజావుగా మాత్రం సాగించలేదు. మతతత్వ ఎజెండా అమలుకేమీ ఇబ్బంది ఉండకపోవచ్చు.

ఇండియా కూటమి, బిజెపి దూకుడుకు చెక్ పెట్టగలిగిన సంఖ్యతో పార్లమెంటులో ప్రవేశించనుంది. బెంగాల్లో టీఎంసీ, తదితర స్వతంత్రులు చేరితే శక్తి గల కూటమిగా 'ఇండియా' ఉండగలుగుతుంది.

ఇండియా కూటమి అధికారంలోకి రాగలిగినా, కొత్త పరిశ్రమలు నెలకొల్పడం, కొత్త ఉద్యోగాలు కల్పించడం, పరిశ్రమల ప్రైవేటీకరణను ఆపడం, పన్నుల భారం తగ్గించడం చేయబోదు. సంక్షోభ కాలం కొనసాగుతూనే ఉంటుంది. బూర్జువా ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను గౌరవించడం, వాటి ఉనికిని అంగీకరించడం లాంటి కనీస ప్రజాస్వామిక తత్వాన్ని అనుసరించ గలిగితే, పార్లమెంటులో లేని శక్తుల సహకారాన్ని పొందగలుగు తుంది. వామపక్ష, విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య పక్షాలను ఊపిరాడకుండా చేసే, వాటిని నాశనం చేసే రాజకీయ సంస్కృతికి భిన్నంగా ఉండవలసి ఉంటుంది. అలా లేనప్పుడు, అది కూడా ఫాసిస్టు ప్రభుత్వమే అనిపించుకుంటుంది.

కొత్త పరిశ్రమలు నెలకొల్పడం, నిరుద్యోగ సమస్య పరిష్కరించడం, పరిశ్రమల ప్రైవేటీకరణ, రైల్వేల ప్రైవేటీకరణలను నిరోధించగలగడం ఐదేళ్లలో అయ్యేవి కావు. విదేశీ పెట్టుబడి దారులకు పీటలు వేయకతప్పదు. ప్రపంచ బ్యాంకు, తదితర బ్యాంకుల నుండి అప్పులు సంపాదించక తప్పదు. ఇవి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ముందుకు వచ్చే సవాళ్ళు.

ఏది ఏమైనా, ఈ ఎన్నికలు బిజెపి దూకుడికి కళ్లెం వేశాయి. టిడిపి, జెడి-యులు బిజెపి దూకుడుకి తోడ్పడితే, ఈ రెండు పార్టీల నిజస్వరూపం వెల్లడవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సరళిని పరిశీలిస్తే గ్రామీణ, ఫ్యూడల్ పెట్టుబడిదారీ, ఆధిపత్య శక్తులు చక్రం తిప్పాయి. ఫ్యూడల్ అహంభావం, పెట్టుబడిదారీ కుటిలత్వం, రెండూ విజృంభించాయనుకోవాలి. అగ్రకుల అహంకారం, ఆభిజాత్యం... బిజెపి, టిడిపి, జనసేన కూటమికి అందనిచ్చింది. బ్రాహ్మణీయ భావజాలం, హిందూమత అభిజాత్యం, బ్యూరోక్రాట్లు, ఉద్యోగస్తుల అసంతృప్తి, డబ్బు, సెలబ్రిటీతనాలను ఈ కూటమి ఉపయోగించుకుంది. తిరుగులేని మెజారిటీ సాధించి, ఫాసిస్ట్ బిజెపి ఒడిలో కూర్చోబోతున్నది. ఆంధ్ర ప్రజలు జాగరూకులై ఉండాలి.

యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్సిపి) పథకాలైన నవరత్నాలను నూటికి నూరుపాళ్ళు అమలు జరిపామని, 2.70 లక్షల కోట్ల రూపాయలు ప్రత్యక్ష నగదు బదిలీ చేశామని, అయినా ఎందుకు ఓడిపోయామో తెలియడం లేదని ముఖ్యమంత్రి 'ఆవేదన 'చెందుతున్నాడు. తనకు 40 శాతం వోట్లు (1.3 కోట్లు) ఇచ్చినందుకు కన్నీళ్ళ పర్యంత మయ్యాడు. ప్రజలకు నేరుగా అన్నీ చేర్చుతున్నప్పుడు, అంతకంటే పెద్ద వాగ్దానం టిడిపి, బిజెపి, జేఎస్పీ పార్టీలు ప్రకటించి ప్రజలకు ఆశలు కలిగించాయి. ఏ బుర్జువా పార్టీ అయినా ప్రజలను ఆశల పందిర్లు ఎక్కించగలవు. వైసిపి గానీ టిడిపి గానీ ఇచ్చిన వాగ్దానాలు ప్రజలందరికి అందించగలిగాయా? తాను పేదలైన ఎస్సి, ఎస్టి, బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నానని, ఇది పేదలకు - పెత్తందారులకు నడుమ జరుగుతున్న పోరాటం అని జగన్ పదేపదే మాట్లాడాడు. ఇది రెడ్డి - కాపు - కమ్మ పెత్తందారులకు మింగుడుపడని మరో అంశం. ప్రభువు అంటే క్రీస్తు -ప్రభువు అన్నమాట, ఆ పదం పెద్దగా ఉపయోగించకపోయినా - అతను క్రిస్టియన్ అన్న భావన మత, కుల, ఛాందసుల బుర్రల్లోకి వెళ్ళింది.

గత ఐదేళ్ల పాలనా కాలంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలన్నింటికీ వంత పాడుతూ వచ్చింది. వీధుల్లోకి వచ్చిన ప్రజాసమూహాలన్నింటిపై నిర్బంధాలు, నిషేధాలతో నిరంకుశంగా వ్యవహరించేందుకు ప్రత్యేకించి జీవోలను తెచ్చింది. కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్లు, వైఎస్ఆర్సిపి ఓటమికి ఇంకా అనేక కారణాలు ఉండవచ్చు. అయితే వారి ఘోర ఓటమికి కారణంగా సోషల్ ఇంజనీరింగ్‌ను, సంక్షేమ పథకాలను అమలు జరపటాన్ని నమ్ముకోవటమే. కమ్మ - కాపు - రెడ్డి కుల పెత్తందారులు, మత ఛాందసవాదుల అసంతృప్తి తోడైందనే కారణాన్ని కూడా చేర్చు కోవాలి. జగన్ సామ్యవాది కాదు, సామాన్యవాదీ కాదు... అయినప్పటికీ 'కులం, మతం జోలికి వస్తే ఊరుకోము' అనే వాస్తవం రుజువైంది.

ప్రజలు జాగరూకులై ఉండాలి. వ్యవసాయాన్ని రక్షించు కునేందుకు, వ్యవసాయధారిత పరిశ్రమల కోసం, సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని ధిక్కరించాల్సిన అవసరం, ప్రజా ఉద్యమాలను సంఘటిత పరచుకోవాల్సిన అవసరం ఉంది.

★★★★★